క్లుప్తంగా

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయండి

మామిడికుదురు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ జక్కంపూడి వాసు సూచించారు. లూటుకుర్రులో శనివారం గృహసారథులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. వాటిని ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకు రావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి అండగా నిలిచే విధంగా వారిని కార్యోన్ముఖుల్ని చేయాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు అడబాల చక్రపాణి, కన్వీనర్ బళ్ల నారాయణమూర్తి, ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం, అప్పన రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పలువురి పరామర్శ



ఎమ్మెల్యే చిట్టిబాబును పరామర్శిస్తున్న టీటీడీ ట్రస్టు బోర్డు సభ్యుడు సతీష్‌కుమార్

మామిడికుదురు: అనారోగ్యంతో హైదరాబాద్ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది నగరంలోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును శనివారం పలువురు ప్రజా ప్రతినిధులు పరామర్శించి ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. అనారోగ్యం నుంచి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజల మధ్యకు రావాలని అభిలషించారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యానారాయణ రావు నగరం గ్రామంలో ఎమ్మెల్యే చిట్టిబాబును పరామర్శించారు. అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని సూచించారు. అలాగే పలువురు పార్టీ నాయకులు పరామర్శించారు.

బాలబాలాజీ సన్నిధిలో 'పొన్నాడ'

మామిడికుదురు: టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే, కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శనివారం అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీ, భూ సమేతంగా కొలువుదీరిన బాలబాలాజీ స్వామిని దర్శించుకున్న అనంతరం పొన్నాడ అర్చకుల నుంచి వేదాశీర్వచనం అందుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి సతీష్‌కుమార్‌కు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

చవితి ఉత్సవాలకు శ్రీకారం

అంబాజీపేట: గణపతి నవరాత్ర ఉత్సవాలకు ఆయా కమిటీల ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శనివారం పందిరిరాట ముహూర్తం చేశారు. స్థానిక కొర్లపాటి వారిపాలెంలో శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో బాలగణపతి మందిరం వద్ద పందిరిరాటను పాతి ప్రత్యేక పూజలు చేశారు.

గర్భిణులకు పరీక్షలు

సఖినేటిపల్లి: మండలంలోని రామేశ్వరం పీహెచ్‌సీలో శనివారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎండీఎపి యూనస్ గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. జాతీయ ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో సుమారు 40 మందిని ఆయన పరీక్షించారు. అవసరమైన వారికి తగిన పరీక్షలు సిబ్బంది పీహెచ్‌సీలో చేశారు. ఈ మేరకు మందులను వారికి పంపిణీ చేశారు. అలాగే హైరిస్క్ గర్భవతులను గుర్తించి, వారికి తగు భరోసా ఆయన ఇచ్చారు. సుఖప్రసవం కోసం సూచనలు చేశారు. గుడిమూల సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో వారికి పులిహోర, ఫ్రూట్ జ్యూస్‌లను అందజేశారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అనారోగ్యంపై నిర్లక్ష్యం వద్దు



గంగలకుర్రులో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అనారోగ్యంగా ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వైద్యం చేయించుకోవాలని అంబాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కేవీఎస్ శ్రీనివాస్ అన్నారు. గంగలకుర్రు ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఉన్న విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ భోజనం చేసే ముందు చేతులు శుభ్ర పరుచుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం ఉంటామన్నారు. జ్వరం, తలనొప్పి, విరేచనాలు తదితర బాధలు ఉంటే వెంటనే పీహెచ్‌సీకి రావాలన్నారు. అనంతరం విద్యార్థుల నుంచి రక్త నమూనాలను సేకరించి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బి.అప్పారావు, ఎంఎల్‌హెచ్‌పీ నిస్సీ, ఎంపీహెచ్ఏ ప్రసాద్, ఏఎన్ఎం పి.మాధవీరాణి, ఆశా, వసతి గృహ వార్డెన్‌లు పాల్గొన్నారు.

సాగుకు సహకారి - రైతుకు ఉపకారి

- రైతులకు అండగా ఆర్బీకేలు
- విత్తు నుంచి విక్రయం వరకూ భరోసా
- నాలుగేళ్లలో రైతుల ఖాతాలకు రూ.46.70 కోట్ల జమ



వెదిరేశ్వరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్‌బీకే

రావులపాలెం: ఒకప్పుడు వ్యవసాయం చేయాలంటే ప్రతి పనికి మండల కేంద్రాలకు వెళ్లి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. రోజుల తరబడి తిరిగినా పనులు జరగకపోవటం, మరోపక్క వరుస నష్టాలు ఎదుర్కొంటున్న అన్నదాతకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేక వ్యవసాయం దండగగా మారి రైతులు తీవ్ర నిరుత్సాహపడేవారు. అయితే పాదయాత్ర ద్వారా రైతుల కష్టాలను దగ్గరగా చూసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి అధికార యంత్రాంగాన్ని రైతులకు చేరువ చేయడమే కాకుండా రైతు భరోసా, వైఎస్సార్ పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ రుణాలు, పంటల సాగుకు కావలసిన యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచటంతో ప్రస్తుతం రైతులకు వ్యవసాయం పండగలా మారింది. మండలంలో 9 వేల 969 ఎకరాల సాగు భూమి ఉండగా 6,088 మంది రైతులు పంటల సాగు చేస్తున్నారు. మండలంలో గత ప్రభుత్వాల హయాంలో ఎప్పుడు లేని విధంగా వైఎస్సార్ యంత్రసేవా పథకం కింద 115 మంది రైతులకు, రూ.కోటి మూడు లక్షల 94 వేలు, అలాగే వివిధ పథకాల ద్వారా మొత్తంగా రూ.46.70 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమ చేసింది. గత ప్రభుత్వ హయాంలో కంటి తుడుపుగానే రైతులకు అరకొరగా పంట నష్టపరిహారం అందించారు.

రైతులకు అందుబాటులో అధికారులు



గతంలో మండలానికి వ్యవసాయాధికారి, ఇద్దరు సహాయకులు ఉండేవారు. ప్రస్తుతం మండలంలో 23 ఆర్బీకేలు ఉన్నాయి. ప్రతి కేంద్రంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులు అందుబాటులో ఉన్నారు. సాగుకు అవసరమైన సూచనలు, సలహాలు అందించడంతో పాటు వ్యవసాయ పథకాలపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా విత్తు నుంచి విక్రయం వరకు అన్న నినాదంతో వ్యవసాయ అధికారులు నిరంతరం రైతు సేవలో, రైతు కొరకు, మా వంతు కృషి చేస్తున్నాం.

– బి.మీనా, ఏవో, రావులపాలెం

అందుబాటులో ఎరువులు



గతంలో వ్యవసాయ అవసరాల నిమిత్తం ఎరువులు మండల కేంద్రానికి వెళ్లి కొనుగోలు చేయవలసి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం గోపాలపురంలో ఆర్‌బీకే ఏర్పాటు చేయడంతో కష్టాలు తప్పాయి. స్థానిక గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి, వారి సూచనల మేరకు పంటకు కావలసిన యూరియా, కాంప్లెక్స్ ఎరువులను, ఎంఆర్‌పీ ధరలకే అందుతున్నాయి. అలాగే ఆర్‌బీకేల్లో ఎరువులు, యూరియా ఎటువంటి కొరత లేకుండా అందుబాటులో ఉంటునాయి.

– ముత్యాల సత్తిపండు, రైతు, గోపాలపురం

ఈ-పంట నమోదుతో రైతుకు భరోసా



నేను ఐదెకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేస్తున్నాను. ఈ పంట నమోదు రైతు భరోసా కేంద్రంలో ప్రతి సీజన్‌లో చేయించుకొనుట ద్వారా పంటరుణాలు పొందుటకు, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయినప్పుడు నష్ట పరిహారం పొందుట, ఉచిత పంటల బీమా, ధాన్యం మద్దతు ధర, ధాన్యం కొనుగోలు ఆర్‌బీకే ద్వారా చేయుటకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– పితాని రాధాకృష్ణ, రైతు, లక్ష్మీపోలవరం

రావులపాలెం మండలంలో రైతులకు పథకాల వారీ సొమ్ములు ఇలా..

రైతు భరోసా (రైతు భరోసా, పీఎం కిసాన్)

సంవత్సరం	రైతులు	సొమ్ములు (రూ.)
2019-20	5806	7.83 కోట్లు
2020-21	5819	7.85 కోట్లు
2021-22	5866	7.91 కోట్లు
2022-23	5898	7.96 కోట్లు
2023-24	5952	4.83 కోట్లు (మొదటి విడత)

సున్నా వడ్డీ రుణాలు

సంవత్సరం	రైతులు	సొమ్ములు(రూ.)
2019-20	124	4 లక్షలు
2020-21	112	3 లక్షలు
2021-22	146	8 లక్షలు
2022-23	134	5 లక్షలు

వైఎస్సార్ ఉచిత పంటల బీమా

సంవత్సరం	రైతులు	సొమ్ములు (రూ.)
2020-21	3898	1.93 కోట్లు
2021-22	2294	3.58 కోట్లు
2022-23	2201	1.53 కోట్లు

పంట నష్టపరిహారం

సంవత్సరం	రైతులు	సొమ్ములు (రూ.)
2019-20	99	6 లక్షలు
2021-22	1004	68 లక్షలు
2022-23	1784	1.30 కోట్లు

వైఎస్సార్ యంత్ర సేవా పథకం

సంవత్సరం	రైతులు	సొమ్ములు (రూ.)
2020-21	25	24.54 లక్షలు
2021-22	45	34.52 లక్షలు
2022-23	45	44.88 లక్షలు

శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం



నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి శస్త్రచికిత్సకు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు శనివారం ఆర్థిక సాయం చేశారు. గ్రామానికి చెందిన దూనబోయిన నాగేశ్వరరావు ఒక హోటల్‌లో సర్వర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల ఒకటిన తన పని ముగించుకొని ఇంటికి వెళ్లే దారిలో హైవే దాటుతుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. కుడి కాలికి గాయమైంది. మడమ విరిగి నడవలేని స్థితిలో ఆస్పత్రిలో చేరిన నాగేశ్వరరావుకు శస్త్రచికిత్స కోసం వైద్యులు రూ.లక్ష వరకూ ఖర్చవుతుందని తెలిపారు. ఈ ఆపరేషన్‌కు ఆరోగ్యశ్రీలో కవరేజ్ లేకపోవడంతో అతని కుటుంబసభ్యులు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులను సాయం చేయాలని కోరారు. దీంతో శస్త్రచికిత్స నిమిత్తం సంస్థ తరఫున రూ.10 వేలు, సేవా సమితి సభ్యుడు, ఎస్‌వీ ఈవెంట్స్ అధినేత కొవ్వూరి ధర్మారెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా రూ.5 వేలు మొత్తంగా రూ.15 వేలు నగదు సాయంగా అందజేశారు.

వాడపల్లి వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యేలు పొన్నాడ, చిర్ల

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, టీటీడీ బోర్డు మెంబర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఈవో, చైర్మన్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వార్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చంద్రబాబు నిప్పు కాదు.. తుప్పు



కొత్తపేటలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి

కొత్తపేట: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నిప్పు కాదని రాష్ట్రానికి పట్టిన తుప్పు అని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి విమర్శించారు. శనివారం సాయంత్రం కొత్తపేటలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు అవినీతి కార్యకలాపాలను వివరించారు. అధికారం చేతిలో ఉందని ప్రభుత్వ సొమ్ము రూ.371 కోట్లు అవినీతి చేశారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన 2 నెలలకే కేబినెట్‌ను తప్పుదారి పట్టించి వెంటవెంటనే ఆయన అనునాయులతో ఓపెన్ చేయించిన షెల్ కంపెనీలకు ప్రభుత్వ సొమ్ము రూ.371 కోట్లను మళ్లించి అధికార దుర్వినియోగానికి, ప్రభుత్వ సొమ్ము అవినీతికి పాల్పడితే దానిని విచారించిన చేసిన పోలీసు వారు పక్కా ఆధారాలతోనే చంద్రబాబును అరెస్ట్ చేశారని ఈ మాత్రం దానికే టీడీపీ శ్రేణులు ఎందుకు ఉలిక్కిపడుతున్నారని, ప్రజాస్వామ్యంలో చిన్నవారైనా పెద్దవారైనా తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని గ్రహించాలని హితవు పలికారు. అధికారమదంతో నాడు ఎన్టీ రామారావును, మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని ఎన్నో హింసలు పెట్టారన్నారు. వారి శాపాలు నేడు చంద్రబాబుకు తగిలాయన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట చేసిన స్కాం ఇది అని, రూ.3356 కోట్లలో 10 శాతం ప్రభుత్వం చెల్లించాలని చెప్పి ఎలాంటి అధికార చర్చలు లేకుండా 2 రోజుల్లో సొమ్ము ట్రాన్స్‌ఫర్ చేసేసి అవినీతికి తెరతీశారని అన్నారు. సీమెన్స్ నుంచి రావాల్సిన గ్రాంట్‌గా ఒక్కపైసా కూడా రాకుండానే ప్రజల సొమ్ము రూ.371 కోట్లు ఎలా విడుదల చేసిందని ప్రశ్నించారు. చంద్రబాబుకు ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ నోటీసులు ఇస్తే వారికి సరైన సమాధానం ఇవ్వలేని మీకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని హితవు పలికారు. సీఎం జగన్ చేసిన అప్పుతో ప్రజా సంక్షేమ పథకాలకు ఖర్చు చేస్తుంటే నాడు చంద్రబాబు అప్పు చేసిన సొమ్ము సొంతానికి దోచుకున్నారని విమర్శించారు. అటువంటి వ్యక్తిని దొంగ అని కాక ఇంకేమనాలని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వ అధీనంలో ఉండే ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ చంద్రబాబునాయుడుకు చట్టబద్ధంగా నోటీసులు ఇస్తే కనీసం స్పందించని పవన్‌కల్యాణ్ ఆయనను పూర్తి ఆధారాలతో అరెస్టు చేస్తే ఆఘమేఘాల మీద స్పందించేశారని ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని అన్నారు. సమావేశంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, స్థానిక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యులు చావలి సుబ్బరాయశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మాతృ, శిశు మరణాల నివారణకు పీఎంఎంఎస్‌ఏ



అంబాజీపేటలో గర్భిణులకు పౌష్టికాహారం, మందులు అందిస్తున్న ఎంపీపీ, వైద్యాధికారి

ఆలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్‌ఏ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్, ఆర్.సుదర్శన్‌బాబు, డి.సువర్చలా నాయుడు అన్నారు. పీఎంఎంఎస్‌ఏ పథకంలో భాగంగా ఆయా పీహెచ్‌సీల పరిధిలో శనివారం సుమారు 132 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. సమావేశంలో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను, తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరోగ్య, అంగన్వాడీ, ఆశ సిబ్బంది వివరించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా తొమ్మిది లేక పదో తేదీన బాలింతలు, గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరారు. సీహెచ్‌ఓ పీపీ రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా పి.గన్నవరం సీహెచ్‌సీలో బుధవారం 45 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, వైద్యులు కె.అన్నాజీరావు, యు.రాఘవేంద్రరావు, హెడ్ నర్సు జీఎల్ అనంతకుమారి తదితరులు వైద్య సేవలు అందించారు. అలాగే నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి వై.శ్రీవల్లి ఆధ్వర్యంలో 40 మంది గర్భిణులకు వైద్య సేవలు అందించారు. పాలకొల్లుకు చెందిన బోళ్ల వీరాస్వామి సత్రం ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఎంపీహెచ్ఈఓ ఎ.నాగరాజు, ఎంపీహెచ్ఎస్ బీవీవీఎస్ఎన్ మూర్తి, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట: పోషకాహారాన్ని తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీ వద్ద గర్భిణులకు పౌష్టికాహారాన్ని, పండ్లు, మందులను వైద్యాధికారిణి వి.గౌతమి ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, నాయకులు కొర్లపాటి కోటబాబు, సుదాబత్తుల రాము, చింతపల్లి వెంకటేశ్వరరావు, పితాని శెట్టి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిశాయి. చింతలూరు, నర్శిపూడి, గుమ్మిలేరు, సంధిపూడి తదితర గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తిపారవశ్యం చెందారు. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకులు చక్రవర్తుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్న ప్రసాదం స్వీకరించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి కూడా భక్తులు పోటెత్తారు.

లోక్ అదాలత్‌లో 103 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి

రాజోలు: స్థానిక కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 103 కేసులను పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎం.ప్రమీలారాణి ఆధ్వర్యంలో అదాలత్ నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.హిమబిందు రెండు బెంచ్‌లుగా కేసులను పరిష్కరించారు. సివిల్-14, క్రిమినల్-53, ఎన్ఐ యాక్ట్-5, బ్యాంకు రుణాలు-4, బీఎస్ఎన్ఎల్-27 కేసులు పరిష్కారమయ్యాయి. మొత్తం 103 కేసులకు సంబంధించి రూ.1.77 కోట్ల లావాదేవీలకు పరిష్కారం లభించింది. లోక్ అదాలత్ సభ్యులు ఎల్‌వీ ప్రసాద్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 507 కేసులు పరిష్కరించారు. జూనియర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు అధ్యక్షతన జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమంలో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ టీఎస్ ఎస్ మోహన్ పాల్గొన్నారు. వివిధ సివిల్, క్రిమినల్ కేసులు విచారించారు. మనీ దావాలు 7, టైటిల్ దావా 1, ఈపీ 2, చెక్ బౌన్స్ 2, మెయింటెనెన్స్ 3, గృహ హింస చట్టం 1 పరిష్కరించారు. పోలీసు కేసులు 44, పోలీస్ అడ్మిషన్స్ కేసులు 404, బీఎస్ఎన్ఎల్ 43 పరిష్కరించారు. వివిధ కేసులు ద్వారా రూ.57,40,864 రికవరీ చేశారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని సంరక్షించుకోవాలి



విశాఖపట్నంలో ఎకో సంస్థ, ఏపీ ఎన్‌జీసీ ప్రముఖులతో క్లస్టర్ కో ఆర్డినేటర్ ప్రభావతి

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు పండిట్, ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ రాజోలు క్లస్టర్ కో ఆర్డినేటర్ గుండేపల్లి ప్రభావతి విశాఖపట్నంలో నిర్వహించిన పర్యావరణ సంరక్షణ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఎకో ఇండియా, ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ (ఎన్‌జీసీ) సంస్థలు సంయుక్తంగా ఈ శిక్షణ తరగతులు నిర్వహించాయి. వివరాలను ఆమె శనివారం మీడియాకు తెలిపారు. ఎకో ఇండియా సంస్థ అధినేత్రి దీపారూ, ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ డైరెక్టర్ స్రవంతి, స్టేట్ కో ఆర్డినేటర్ నీలకంఠ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి సంబంధించిన అనేక అంశాలపై తమకు శిక్షణ ఇచ్చినట్టు ప్రభావతి తెలిపారు. ప్రధానంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావణానికి సంభవిస్తున్న పెనుముప్పుపై మరింత సమాచారం ఇచ్చారన్నారు. ఎకో సంస్థ ప్రతినిధులు, నేషనల్ గ్రీన్ కోర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి భవనం ప్రారంభం

ఆలమూరు: స్థానిక మెయిన్‌రోడ్డులో సుమారు రూ.కోట్లతో నిర్మించిన ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి (సీహెచ్‌సీ) భవనాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని భవనాన్ని ప్రారంభించనున్నారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

జస్వంత్‌కు మహేష్ ఫ్యాన్స్ సాయం



రామేశ్వరంలో జస్వంత్ కుటుంబ సభ్యులకు సాయం చేస్తున్న మహేష్‌బాబు ఫ్యాన్స్

సఖినేటిపల్లి: మండలంలోని రామేశ్వరానికి చెందిన మహేష్‌బాబు అభిమాని చెల్లుబోయిన జస్వంత్ సాయికి శనివారం మహేష్ ఫ్యాన్స్ సమకూర్చిన రూ.21,000 ఆర్థిక సాయం పంపిణీ చేశారు. రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడి కాకినాడ అపోలో ఆసుపత్రిలో జస్వంత్ చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు అతని చికిత్స నిమిత్తం పై మొత్తాన్ని కుటుంబ సభ్యులకు ఫ్యాన్స్ అందజేశారు. సఖినేటిపల్లి, మలికిపురం మండలాల టౌన్ వైడ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరావు, కార్యదర్శి నేతల శ్రీనివాసరావు, సభ్యులు జె.ఉదయ్‌కిరణ్, రాపాక సూర్య, సీహెచ్ మణికంఠ, సీహెచ్ విల్సన్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమంతో జనరంజక పాలన

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- కొత్తపేటలో గడప గడపకూ..



కొత్తపేటలో లబ్ధిదారులకు బ్రోచర్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్ర చరిత్రలోనే కాదు దేశ చరిత్రలోనే ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక 2 వ సచివాలయం పరిధిలో శుక్రవారం సాయంత్రం నుంచి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా వివిధ పథకాలు పొందిన లబ్ధిదారులు జగ్గిరెడ్డికి సాదరంగా స్వాగతం పలికారు. ఆయా లబ్ధిదారులకు వర్తించిన పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. ఆయా లబ్ధిదారులు జగన్ ప్రభుత్వం పట్ల, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పట్ల ఆయా కుటుంబాల వారు అభిమానం వ్యక్తం చేశారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, స్థానిక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, పర్సన్ దంగేటి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ చావలి సుబ్బరాయశాస్త్రి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెలి లక్ష్మీపతిరావు, సర్పంచ్ రెడ్డి చంటి, పంచాయతీ సభ్యుడు బొక్కా లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

రాపాకను కలసిన ఏలూరు మేయర్



ఎమ్మెల్యే రాపాకను కలసిన మేయర్ నూర్జహాన్ దంపతులు

మలికిపురం: రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాద రావును ఏలూరు కార్పొరేషన్ మేయర్ షేక్ నూర్జహాన్ దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. మలికిపురం మండలం కత్తిమండ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఈ మేరకు రాజోలు ఎమ్మెల్యే రాపాకను కలసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎన్ రాజు తదితరులు ఉన్నారు.